క్లుప్తంగా

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి (వట్టిమల్ల)లో ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళన చేశారు. రోడ్డువద్ద ఆందోళన నిర్వహించిన మహిళలు మాట్లాడుతూ గ్రామంలోని 8వ వార్డులో గత కొన్ని రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు సమస్య గురించి విన్నవించినా స్పందించడంలేదన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై సర్పంచ్ గోపు పర్శరాములు, వార్డు సభ్యురాలు నూనె లింగవ్వ మాట్లాడుతూ 8వ వార్డులో మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజూ వస్తున్నాయని, హన్మాన్ టెంపుల్ వద్ద మోటారు పాడైతే ఇప్పటికీ మూడుసార్లు జీపీ తరపున చేయించామన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సపాయి కార్మికులకు సన్మానం



సన్మానిస్తున్న పంచాయతీ పాలకవర్గం

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో 30 మంది సపాయి కార్మికులను సర్పంచ్ గాండ్ల సుమతి, ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్‌లు గురువారం ఘనంగా సన్మానించారు. ముస్తాబాద్‌లో చేపట్టిన పారిశుధ్య పనుల్లో భాగంగా పనిచేస్తూ ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. వారికి సబ్బులు, నూనెలు, దుస్తులను అందజేశారు. ఎంపీటీసీలు మంజుల, శ్రీనివాస్, స్వేచ్ఛ, కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



టీవీని హెచ్‌ఎంకు అందిస్తున్న యువకులు

చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన యువకులు ఆన్‌డ్రైడ్ టీవీని బుధవారం బహూకరించారు. టీవీని అందజేసిన వార్డు సభ్యుడు బొజ్జ మహేందర్, కర్ర భూపతిరెడ్డి, బొజ్జ నవీన్, న్యాతరి అశోక్, ఎలిగేటి సంజీవ్, గోగూరి శ్రీకాంత్, గంగిపెల్లి శ్రీకాంత్, గుంటుక అనిల్‌ను ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

పొంచిఉన్న మృత్యుపాశాలు

- ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలకు కర్రదుంగలే దిక్కు
- తెలిసీ పట్టించుకోని సెస్ అధికారులు
- వర్షాకాలంలో పొలాల్లో ఉండేందుకు భయపడుతున్న రైతులు



బండపల్లిలో వేలాడుతున్న విద్యుత్ తీగలను కర్ర సహాయంతో ఎత్తి పొలం కోయిస్తున్న రైతు



చందుర్తిలో వేలాడుతున్న వైర్లకు కర్రదుంగలను ఏర్పాటు చేసుకున్న రైతు



ఆశిరెడ్డిపల్లెలో వంగిన స్తంభం

చందుర్తి: పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు రైతుల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి వేలాడుతున్న తీగలను సరిచేయాలని సెస్ అధికారులు, సిబ్బందికి మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదు. వేలాడుతున్న తీగలకు రైతులు కర్రదుంగలను ఏర్పాటు చేసుకుని పైకి విద్యుత్ తీగలను ఎత్తి కట్టుతున్నారు. సెస్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని 19 గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలే నిదర్శనం.

మరమ్మతులెక్కడా?

ప్రతి సంవత్సరం సెస్ అధికారులు విద్యుత్ లైన్‌లో ఇబ్బందులను సరిచేస్తున్నామని చెబుతూ గ్రామాలకు విద్యుత్ అంతరాయాన్ని ప్రకటిస్తున్నారు. కాని పనులు మాత్రం ఇక్కడ చేసిన దాఖలాలు కనిపించడం లేదని గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. వేసవికాలంలో 15 నుంచి 20 రోజుల పాటు విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్నామని ప్రకటించే సెస్ అధికారులు రైతుల ఆరోపణలకు బదులు చెప్పే బాధ్యత ఉందని ఆయా గ్రామాల సెస్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలోని పలు గ్రామ చావడిల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేక ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉండాల్సిన ఎత్తులో కాకుండా కిందికి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడంతో మూగజీవాలు విద్యుద్ఘాతానికి బలవుతున్నాయి. ఇది తెలిసి కూడా సెస్ అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించే కన్నా ముందుగా అప్రమత్తమైతే ప్రాణాలైనా మిగులుతాయన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ తీగలను సరిచేయాలి



వేలాడుతున్న విద్యుత్ తీగలను బిగించాలని సెస్ సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మనుషుల ఎత్తులో ఉండడంతో కర్రదుంగలతో పైకి ఎత్తి కట్టుకుంటున్నారు. ఈదురు గాలులు వీచినప్పుడు కర్రలు ఊడిపోతే పంట చేల్లో పనిచేసుకుంటూ ఉంటే ప్రాణాలే పోతాయి.

– యాళ్ల దామోదర్‌రెడ్డి, యువరైతు, బండపల్లి

స్తంభాలను బాగుచేయాలి



ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని వంగి స్తంభం ఐదారేళ్లుగా అలాగే ఉంటుంది. ఈదురు గాలులు వీచినప్పుడల్లా కొంత వంగుతోంది. ప్రమాదవశాత్తు కూలితే రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు అపాయం జరిగే అవకాశముంది. కరెంటోళ్లకు కనిపించినప్పుడల్లా చెప్పితే విన్నట్లే.. వింటున్నా సరిచేస్తలేరు.

– కోన గంగమల్లయ్య, రైతు, ఆశిరెడ్డిపల్లి

సమస్యలను గుర్తించాం



గ్రామాల వారీగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసేందుకు మిడిల్ పోల్స్ వేయించడం లేదంటే, లూజ్‌గా ఉన్న వైర్లు బిగించడం, వంగిన స్తంభాలను సరిచేయించడానికి ప్రణాళికను సిద్ధం చేసుకున్నాం. ముందుగా మల్యాల, బండపల్లి గ్రామాల్లో పనులు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఇరువై రోజుల్లో పనులను పూర్తి చేయిస్తాం.

– పొన్నాల శ్రీనివాస్‌రావు, సెస్ డైరెక్టర్, చందుర్తి

సమాచారం

నేడు సెస్ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలో సిరిసిల్ల టౌన్–1, సిరిసిల్ల టౌన్–2, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన సిరిసిల్ల సెస్ సంస్థ విద్యుత్ వియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల సెస్ ఎండీ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కార వేదికకు హాజరై ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

రుద్రంగి బాలుర వసతి గృహంలో 65 సీట్లు

రుద్రంగి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతిగృహంలో 65 సీట్లు ఉన్నాయని దూర ప్రాంత, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు వసతిగృహంలో చేరేందుకు మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతిగృహంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్ రవీంద్రస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నియామకం

ముదిరాజ్ యూత్ కార్యవర్గం

కోనరావుపేట: మండలం సుద్దాలలో ముదిరాజ్ జిల్లా యూత్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా యూత్ అధ్యక్షుడు పండుగ రాజు ఆధ్వర్యంలో గ్రామ యూత్ అధ్యక్షుడిగా చీకోటి రాజు, పుట్ట శేఖర్, వేములవాడ డివిజన్ పీఆర్వోగా యామ అజయ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు చీకోటి పర్శయ్య, బాలమల్లు, రాజయ్య, రమణ, హరీశ్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు



తెలంగాణ అవిర్భావ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి, పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీలు, పల్లె ప్రగతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికులకు చేతి సంచులు, ఉత్తమ సేవా సర్టిఫికెట్లను అందజేసి సన్మానించారు. డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్‌లతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి బతుకమ్మలు ఆడారు. పొత్తూరులో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పాల్గొనగా, ఆయా మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎస్సైలు, సెస్ డైరెక్టర్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/తంగళ్లపల్లి/గంభీరావుపేట/ఇల్లంతకుంట/వీర్నపల్లి వేములవాడఅర్బన్/ కోనరావుపేట/బోయినపల్లి/రుద్రంగి



రుద్రంగి: బతుకమ్మ ఆడుతున్న ఎంపీపీ, సర్పంచ్, మహిళా సంఘాల సభ్యులు



బోయినపల్లిలో..



తంగళ్లపల్లి: బద్దెనపల్లిలో..



ఇల్లంతకుంట: వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ వైస్‌చైర్మన్



ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌లో..



కోనరావుపేట: నిమ్మపల్లిలో బతుకమ్మలతో మహిళా సంఘాల సభ్యులు

రాష్ట్ర సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న జాడి బాల్‌రెడ్డి

ఇల్లంతకుంట: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన మండల మోర్చా కమిటీ సమావేశంలో మాట్లాడారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను జనాల్లోకి తీసుకెళ్లాలన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, రైతు రుణమాఫీ చేయలేదని, రైతులకు ఇస్తామన్న రూ.10 వేల పంట పరిహారం ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు 10 కిలోల ధాన్యం కోతలు పెట్టి మిల్లర్లతో కలిసి దోపిడీ చేస్తోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ శ్రావణ్, నాయకులు సంపత్, లక్ష్మారెడ్డి, శేఖర్, ముత్తక్క, రాజిరెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ



తంగళ్లపల్లి: గోపాల్‌రావుపల్లెలో భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

తంగళ్లపల్లి: మండలంలోని గోపాల్‌రావుపల్లెలో గ్రామపంచాయతీ నూతన భవనం నిర్మాణానికి గురువారం సర్పంచ్ కూతురి పద్మ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్క సతీష్, పీఆర్ ఏఈ సుమన్, పంచాయతీ కార్యదర్శి వాణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం గోవిందరావుపేట(బావుసాయిపేట) గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ గుగులోత్ రజిత గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రకాశ్, వార్డు సభ్యులు రాంసింగ్, సరిత, గంగ, కార్యదర్శి కవిత, పంచాయతీరాజ్ ఏఈ అంజయ్య పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్లు
- ధ్వంసమవుతున్న రహదారులు
- వాహనదారులకు ఇక్కట్లు



ధ్వంసమైన జవహర్‌లాల్‌నాయక్ తండా రోడ్డు

వీర్నపల్లి: రహదారుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంటే అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. ఏడాది గడవక ముందే రోడ్లన్నీ కంకర తేలి, పగుళ్లు చూపుతున్నాయి. వ్యవసాయ సీజన్‌లలో ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో బీటీ రోడ్డుపై ప్రయాణిస్తుండడంతో రోడ్లలన్నీ ధ్వంసం అవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

నిబంధనలకు పాతర

మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీలు ఉండగా ఊరికో 10 నుంచి 20 ట్రాక్టర్లు వరకు ఉన్నాయి. వరి సాగుకు పొలాలు సిద్ధం చేసేందుకు ఈ ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తున్నాయి. ఇలా ట్రాక్టర్లు రావడంతో రోడ్లన్నీ ధ్వంసమై పూర్తిగా దెబ్బతిని వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. వీర్నపల్లి నుంచి వన్‌పల్లి వెళ్లే ప్రధాన రోడ్డుతో పాటు వీర్నపల్లి మండలం కంచర్ల నుంచి కోనరావుపేటకు, మద్దిమల్ల నుంచి సోమరిపేటకు, గర్జనపల్లి నుంచి జవహర్‌లాల్ నాయక్ తండా, సీతారామ్‌నాయక్ తండాకు, వన్‌పల్లి నుంచి కేలోత్ తండాకు వెళ్లే దాదాపు ఒక్కో గ్రామంలో 2 కిలోమీటర్ల పరిధిలో దారులు ధ్వంసమయ్యాయి. అనుబంధ గ్రామాలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.కోట్లు వెచ్చించి బీటీ రోడ్లు వేసింది. కేజ్‌వీల్స్‌కు పట్టీలు లేకుండా రోడ్లపై ప్రయాణించకూడదనే నిబంధన ఉన్న అధికారులు పట్టించుకోపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు శూన్యం

రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు ప్రయాణిస్తే సదరు ట్రాక్టర్ యజమానిపై ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు జరిమానాలు విధించాలి. తప్పనిసరైతే కేసులు నమోదు చేయాలి. కానీ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో యజమానులకు భయం పోయింది. ఇప్పటి వరకు ఒక్క ట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడం అధికారుల ఉదాసీనతకు నిదర్శనం. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం దక్కనుంది.

చర్యలు తీసుకోవాలి



కేజ్ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– పర్శరాములు, వీర్నపల్లి

కేసులు నమోదు చేస్తాం



కేజ్ వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లపై వెళితే యజమానులపై కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా గమనిస్తే సమాచారం ఇవ్వాలి. వారి వివారాలు గోప్యంగా ఉంచుతాం. పంచాయతీల్లో చాటింపు చేయించి అవగాహన కల్పిస్తాం.

– నవత, ఎస్‌ఐ, వీర్నపల్లి

ట్రాక్టర్లు సీజ్ చేస్తాం



రోడ్డు భద్రతపై గ్రామస్తులు దృష్టి సారించాలి. కేజ్ వీల్స్‌తో ప్రయాణించి రోడ్లు ధ్వంసం చేస్తున్నారనే సమాచారం వస్తోంది. అలాంటి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం.

– తఫజుల్ హూస్సేన్, తహసీల్దార్

పోచమ్మ బోనాలు



రుద్రంగి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ, శ్రీ రాజరాజేశ్వర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం పోసమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల బోనాల పండగ ఘనంగా జరిగింది. మహిళలు ఒక్కపొద్దులతో పోసమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు బోనాలు వండి, నెత్తిన ఎత్తుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఆట పాటల మధ్య ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సభ్యులు చెలుకల తిరుపతి, ఇప్ప మల్లేశం, ఎర్ర ఆశాలు, శ్రీనివాస్, శంకర్, కంటి రెడ్డి, ఆకుల పెద్దన్న, శ్రీరాముల రాజనర్సయ్య, నంద్యాదపు లక్ష్మీనర్సయ్య, గంగాధర్, వెంకటి, మానాల రాజేశం, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని ముదిరాజ్‌లు పెద్దమ్మ పండుగలో భాగంగా పోచమ్మ, పెద్దమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం డప్పుచప్పుళ్లతో పోచమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించారు. ఆనంతరం పెద్దమ్మకు బోనం మొక్కులు చెల్లించారు.

లక్షా 9వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తిచేసినట్లు చైర్మన్ తన్నీరు బాపురావు తెలిపారు. సింగిల్‌విండో పరిధిలోని గ్రామాల్లో 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. లక్షా 9 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి, దిగ్విజయంగా మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రైతు ఖాతాలలో రూ.15 కోట్లు జమ చేశామని వివరించారు. మంత్రి కేటీఆర్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, సిబ్బంది, హమాలీలు, రైతులు, మిల్లర్లు సహరించారన్నారు.

చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ భూక్య శంకర్ నాయక్ గురువారం పంపిణీ చేశారు.